సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్

సైదాబాద్: సౌత్‌ఈస్ట్ జోన్ నూతన డీసీపీగా 2020 బ్యాచ్ ఐపీఎస్ అధికారి పాటిల్ కాంతిలాల్ సుభాష్ నియమితులయ్యారు. ప్రభుత్వం చేపట్టిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఇక్కడ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ధరావత్ జానకి గత నెల 17న మహబూబ్‌నగర్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ అయ్యారు. ప్రభుత్వం సోమవారం చేసిన బదిలీల్లో నిర్మల్ జిల్లా భైంసా ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పాటిల్ కాంతిలాల్ సుభాష్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా రానున్నారు.

చైతన్యపురి విద్యార్థుల ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న చైతన్యపురి అబాకస్ నిర్వాహ కులు

చైతన్యపురి: సిపి అబాకస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో చైతన్యపురి అబాకస్ ఇన్‌స్టిట్యూట్ చిన్నారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి ర్యాంకులో నిలిచారని నిర్వాహకులు సరిత జయంత్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీ పరీక్షల్లో సుమారు రెండువేల మంది చిన్నారులు పాల్గొనగా వరసగా తమ విద్యార్థులు రెండోసారి కూడా రాష్ట్ర విజేత ట్రోఫీ సాధించారని అన్నారు. 18 సంవత్సరాలుగా అబాకస్‌లో సుమారు పదివేల మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చామని ప్రత్యేక ప్రణాళిక, అంకితభావంతో పనిచేసే ఫాకల్టీ వల్ల ఇది సాధ్యమైందన్నారు. ఐసీఎఫ్ఏఐ డైరెక్టర్ డాక్టర్ సాయినాథ్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నట్లు ఆమె తెలిపారు.

పార్టీ మారాల్సిన అవసరం సబితకు లేదు

దిల్‌సుఖ్‌నగర్: మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డికి బీఆర్ఎస్ పార్టీ మారాల్సిన అవసరం ఏమాత్రం లేదని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. సోమవారం గ్రీన్‌హిల్స్‌కాలనీలో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సబితా ఇంద్రారెడ్డి పార్టీ మారుతుందని కొందరు అని సోషల్ మీడియాలో ప్రచారం చేసి, వారే దిష్టి బొమ్మ దహనం చేయడం కాంగ్రెస్ పార్టీ దిగజారిన రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. పలు వేదికలపై పార్టీ మారడం లేదు అని స్వయంగా సబితా ఇంద్రారెడ్డి వెల్లడించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారం చేయడం మానుకోవాలి హితవు పలికారు. సబితా ఇంద్రారెడ్డి కేసీఆర్ నాయకత్వంలోనే బీఆర్ఎస్‌లో కొనసాగుతారని అన్నారు. ప్రజాతీర్పును శిరసా వహిస్తూ ఐదేండ్లు ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామన్నారు. హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టడం మానుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ. 240 కోట్లు తీసుకవచ్చి అభివృద్ధి పనులు ప్రారంభం చేస్తే, ఈ ప్రభుత్వం రాగానే ఆ నిధులను నిలిపేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులపై అసత్య ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

మలక్‌పేట: ఈ విద్యాసంవత్సరం పురస్కరించుకుని దిల్‌సుఖ్‌నగర్ రవీంద్రభారతి స్కూల్లో సోమవారం వేదపండితుల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కనుల పండువగా నిర్వహించారు. హైందవ సనాతన ధర్మాన్ని అనుసరించి బ్రాహ్మణులతో వేదోక్తంగా రెండున్నర నుంచి మూడు సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులతో సరస్వతి పూజలు చేయించారు. జ్ఞాన సరస్వతి దేవీ శ్లోకాన్ని చదివించి పలకలపై 'శ్రీ' నాదాన్ని రాయించారు. ఈ సందర్భంగా జోనల్ డీన్ కొముదవల్లి మాట్లాడుతూ పాఠశాల ప్రారంభ దశలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సరస్వతిదేవీ అనుగ్రహం వలన చిన్నారులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమ, డీఐ దయాకర్, ఏడీఐ నిషాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కార్యాలయంలో ప్రజావాణి



దరఖాస్తులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఎల్‌బీనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. దీంతో టౌన్ ప్లానింగ్ 1, ఇంజినీరింగ్‌లో 1 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు.

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో..

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ 1, పెన్షన్ 1 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



మన్సూరాబాద్: జేఎం గ్రూప్ అధినేత జక్కుల మల్లేష్‌యాదవ్, బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీశ్‌యాదవ్‌లు మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా నోటు పుస్తకాలు, పలకలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఉరేసుకొని ప్లంబర్ మృతి

నాగోలు: ప్లంబర్ పనులు చేసే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఒడిసా రాష్ట్రానికి చెందిన రాకేష్ మాలిక్ (25) గత కొద్దికాలం క్రితం నగరానికి వచ్చి నాగోలు బండ్లగూడ ఆనంద్‌నగర్ చౌరస్తాలో స్నేహితులతో కలిసి ఉంటూ ప్లంబర్ పనులు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్న సమయంలో గదిలో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వారి బంధువు నాగోలు పోలీసులకు స మాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి బంధువు కైలాష్ మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల సేవలో టీసీపీసీ

- ఉపకరణాల అందజేత
- మూడున్నర దశాబ్దాలుగా తయారీ, శిక్షణ
- ఉద్యోగులంతా దివ్యాంగులే



ట్రైసైకిల్ తయారు చేస్తున్న దివ్యాంగ ఉద్యోగి

చాదర్‌ఘాట్: దివ్యాంగులకు నిత్య జీవనంలో వారికి ఉపయోగపడే ఉపకరణాలు ఎంతో అవసరమవుతాయి. అలాంటి ఉపకరణాలను రాష్ట్రంలోని దివ్యాంగులు అందరికీ అందిస్తూ వారి మన్ననలు అందుకుంటుంది మలక్‌పేటలోని ట్రైనింగ్ కమ్ ప్రొడక్షన్ సెంటర్ (టీసీపీసీ). దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నడిచే ఈ సెంటర్ గత మూడున్నర దశాబ్దాలుగా దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తోంది. 1985లో మలక్‌పేటలోని నల్గొండ చౌరస్తాలో అధికారులు టీసీపీసీని ఏర్పాటు చేశారు. ఇందులో దివ్యాంగులకు ఉపయోగపడే పలు రకాల ఉపకరణాలు తయారు చేయటంతో పాటు వాటి తయారీలో శిక్షణ కూడా ఇస్తున్నారు. టీసీపీసీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 21 మంది కాగా వీరందరూ కూడా దివ్యాంగులే కావడం విశేషం. ఈ కేంద్రంలో దివ్యాంగులకు అవసరమైన మూడు చక్రాల సైకిళ్లు, చేతికర్రలు, వీల్‌చైర్‌లు, మొటరైజ్‌డ్ వీల్‌చైర్‌లు, క్రీడాకారులైన దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్‌లు, ఆధునిక చేతికర్రలు, బ్రెయిలీ పుస్తకాలు, బ్యాటరీతో నడిచే వీల్‌చైర్‌లు తయారు చేస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చిన ఉపకరణాల డిమాండ్‌ను బట్టి అధికారులు టీసీపీసీ సిబ్బందికి తయారీలో సూచనలు అందిస్తారు. పూర్తయిన ఉపకరణాలను జిల్లా అధికారుల ద్వారా దివ్యాంగులకు అందిస్తారు. దరఖాస్తు చేసుకున్న సీనియారిటీ ఆధారంగా పంపిణీ నిర్వహిస్తున్నారు. తెలంగాణ వచ్చాక ప్రభుత్వం దివ్యాంగులకు ఉపకరణాలను ఉచితంగా ఇస్తోంది. దీంతో ఎంతోమంది దివ్యాంగులకు మేలు చేకూరుతోంది.



సిబ్బంది తయారు చేసిన ట్రైసైకిళ్లు

ఏరియా ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తాం

వైద్యులు, సిబ్బందితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమీక్ష సమావేశం



వనస్థలిపురం: వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు, మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సమస్యలపై సంబంధిత వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆసుపత్రిలో లిఫ్ట్ సదుపాయం, ఆవరణలో బీటీ రోడ్డు, డయాలసిస్ సేవలు మెరుగుపర్చాలని, మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే లిఫ్ట్ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగిందని, డయాలసిస్ సేవలు, మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, సాగర్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెంటెంట్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్ సమస్యలకు పరిష్కారం చూపాలి

డిప్యూటీ కమిషనర్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ వినతి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జిహెచ్ఎంసి సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాత శ్రీధర్‌కు ప్రజావాణిలో సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్ కుమార్ మాట్లాడుతూ కొత్తపేట డివిజన్లో పరిధిలోని కాలనీలలో వర్షాకాలంలో భారీ ఎత్తున వరదలు సంభవిస్తున్నాయని రోడ్లన్నీ ఎక్కడికక్కడ పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తపేట డివిజన్ పరిధిలో ఉన్నటువంటి కాలనీలలో జలమండలి అధికారులు భూగర్భ డ్రైనేజీల కోసం రోడ్లన్నీ తవ్వి పనులు అయిపోయాక వాటిని మరమ్మతులు కూడా చేయలేదని గతంలో కౌన్సిల్ సమావేశంలో అడిగితే జలమండలి అధికారులను కోటి 76 లక్షలు కట్టాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఆ డబ్బులు వెంటనే కొత్తపేట డివిజన్లో సిసి రోడ్ల నిర్మాణాలకు రోడ్డు మరమ్మతులకు ఉపయోగించాలని డిప్యూటీ కమిషనర్ కోరారు. మరికొద్ది రోజులలో బోనాల పండుగ వస్తున్న సందర్భంగా కాలనీలలో దేవాలయాల దగ్గర తగిన ఏర్పాట్లు చేయాలని ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని కాలనీలలో విద్యుత్ దీపాలు వంటి సమస్యలు లేకుండా చూడాలని డిప్యూటీ కమిషనర్ కోరారు.

మన్సూరాబాద్ డివిజన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

మన్సూరాబాద్: డివిజన్‌పై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి పెద్దపీట వేయాలని నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి కోరారు. జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ సోమవారం మర్యాపూర్వకంగా కలిశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్‌నగర్ సర్కిల్ నుంచే జీహెచ్ఎంసీ నెలకు సుమారు రూ.30కోట్ల ఆదాయం వస్తుందని, వచ్చిన ఆదాయాన్ని తిరిగి అదే ప్రాంతానికి కేటాయించకుండా ఓల్డ్ సిటీకి కేటాయించడం సరికాదన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరై టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేపట్టకుండా జాప్యం చేస్తున్నారని, కాంట్రాక్టర్లపై వత్తిడి పెంచి పనులు మొదలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. డివిజన్‌లోని ప్రధాన సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వివరించి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరానని స్పష్టం చేశారు.

వన మహోత్సవానికి వేళాయె!

మహేశ్వరం: ప్రతీ గ్రామంలో పచ్చదనాన్ని పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. అడవుల శాతాన్ని గణనీయంగా పెంచాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లాలోని వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు.

31 గ్రామ పంచాయతీల్లో..

మహేశ్వరం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రత్యేకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోని నర్సరీల్లో సుమారు 3.50లక్షల మొక్కలను పెంచుతున్నారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో సుమారు 10 వేల మొక్కలు పెంచుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలో సుమారు 15 వేల మొక్కలు పెంచుతున్నారు.

మొత్తం లక్ష మొక్కలు..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో వన మహోత్సవం కార్యక్రమం కింద 1 లక్ష మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి గ్రామ పంచాయతీలో 3,500 మొక్కలు నాటాలని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు సమయానికి కురవక పోవడంతోనే వన మహోత్సవం కింద మొక్కలు నాటడం ఆలస్యమైందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పుడు వర్షాలు కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, మొక్కలు పెంచడంతో పాటు పలు ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. 31 గ్రామ పంచాయతీలకు అవసరమైన మొక్కలను సిద్ధం చేశామని త్వరలో నాటుతామని పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికే మొక్కలు నాటడానికి 5 వేల గుంతలను తీయించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే మొక్కలు నాటుతామని చెబుతున్నారు. గ్రామ పంచాయతీకి వచ్చే నిధుల్లో 10 శాతం నిధులను గ్రీన్ బడ్జెట్‌కి వినియోగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక రక్షణ చర్యలు..

గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలతో పాటు ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంచుతున్నారు. కూలీలను పెట్టి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నారు. ఎండ, వేడిమి నుంచి తట్టుకునేలా గ్రీన్‌నెట్ వేసి నిత్యం మొక్కలకు నీరు పోస్తూ, నర్సరీలలో కలుపు తీయడం, సమయానికి ఎరువులు వేశారు.

పండ్లు, పూల మొక్కలు సిద్ధం..

మండలంలో ఉన్న నర్సరీలలో ప్రధానంగా పండ్లు, పూలు, ఔషధ మొక్కలతో పాటు ఇతర మొక్కలను పెంచుతున్నారు. నేరేడు, జామ, దానిమ్మ, ఉసిరి, కానుగ, గుల్‌మోహార్, మునగ, కరివేపాకు, ఎల్లో టికోమా మొక్కలతో పాటు పలు రకాల మొక్కలను నాటేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

ప్రజావాణికి స్పందన కరువు

చాదర్‌ఘాట్: ప్రతీ సోమవారం జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైందని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసీడీ, ట్యాక్స్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

దేవస్థానం పాలకవర్గం ఎన్నిక

వనస్థలిపురం: వీరశైవ సమాజం ఆధ్వర్యంలోని వనస్థలిపురం ఫేజ్–1లోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం పాలకవర్గాన్ని సోమవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కరిణె శాంతప్ప, అధ్యక్షులుగా దీపావళి శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎం.అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.రవికుమార్, సహాయ కార్యదర్శిగా బి.గౌరీశంకర్, కోశాధికారిగా చౌదరి దివాకర్ లింగం, కార్యవర్గసభ్యులుగా కుషాల్‌కుమార్, గణేష్ ఎన్నికయ్యారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) ఈ విధంగా ఉన్నాయి. టమాట 43, వంకాయ 35, బెండ 28, పచ్చి మిర్చి 70, కాకర 38, బీర 35, క్యాబేజి 35, ఫ్రెంచి బీన్స్ 105, క్యారెట్ 38, దొండ 15–18, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 40, దోస 20, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 35లు ఉండగా ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయని సంబంధిత అధికారులు తెలిపారు.

కమిషనర్‌కు వినతి

నాగోలు: పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా నాగోలు చెరువును సుందరీకరణ పనులు చేపట్టాలని సిపిఐ సీనియర్ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ సోమవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ స్థానిక కాలనీవాసుల సౌకర్యార్థం వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయాలని, పిల్లల కోసం ఆట వస్తువులు, ఓపెన్ జీమ్ తదితర వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. చెరువులో మురుగునీటిని కలవకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఓల్డ్ మలక్‌పేట శ్రీరామచంద్రస్వామి దేవాలయం నూతన కమిటీ సభ్యులు

చాదర్‌ఘాట్: ఓల్డ్ మలక్‌పేట శ్రీరామచంద్రస్వామి దేవాలయం చైర్మన్‌గా సి.హరిబాబు, ట్రస్టీలుగా జె.బాలకృష్ణ, హెచ్.అన్నయ్య, ఎం.రాజేష్, శీలం ఉమారాణిలను ఎండోమెంట్ ఈఓ మారతాన్‌దా, ఇన్‌స్పెక్టర్ ఇందిరా సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని అన్నారు. చౌకి రవికుమార్, నరేందర్ ముదిరాజ్, రాజారావుగౌడ్, పొల్కం శ్రీనివాస్, చౌకి రాజు, రాంకృష్ణ, టిన్నుసింగ్ పాల్గొన్నారు.

నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం



పీఅండ్‌టీ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిశీలిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్

చైతన్యపురి: డ్రైనేజీ సమస్య పరిష్కారానికి త్వరలో నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో డ్రైనేజీ పొంగి రహదారిపై మురుగు నీరు ప్రవహించి ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసుల ఫిర్యాదు చేశారు. దీంతో కార్పొరేటర్ సోమవారం కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో నూతన డ్రైనేజీ పైపులైను నిర్మాణం జరిగేలా చూస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమలో జలమండలి సిబ్బంది ప్రశాంత్, నరేష్ కాలనీవాసులు ఓంకార్, కృష్ణ, రమేష్, హరి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, డిజిటల్ గదులను సోమవారం హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌తో కలసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చి దిద్దేందుకు ముందుగా అన్ని పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు గత వేసవి కాలంలో పనులు చేపట్టామని అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మీ, శ్రీనివాస్ యాదవ్, అనిత, నాగిరెడ్డి, మధు, కిట్టు, అరున్, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్స్ ఓనర్స్‌కు అధికారులు సహకరించాలి



అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్

నాగోలు: గ్రేటర్ హైదరాబాద్‌లో 4 3/4 రిగ్గ్ ఓనర్స్ అసోసియేషన్ అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారని వారికి ప్రభుత్వ అధికారులు సహకరించాలని అసోసియేషన్ అధ్యక్షులు టి.వెంకటేష్ అన్నారు. సోమవారం నాగోలు కిన్నెర గ్రాండ్ హోటల్‌లో సోమవారం గ్రేటర్ హైదరాబాద్‌లో 4 3/4 రిగ్గ్ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోర్‌వెల్స్ ఓనర్స్ అధిక సంఖ్యలో పాల్గొని వారి సమస్యలను సమావేశంలో వివరించారు. అనంతరం అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జోనల్ వ్యవస్థ ద్వారా బోర్‌వెల్స్ నడపడం వల్ల సమస్యలు తలెత్తాయని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇకపై సెంట్రల్ కమిటీ ద్వారా బండ్లు నడుపుతామని ఈ సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. ఈ తీర్మానాలు బుధవారం నుంచే ఇది అమలు అవుతుందని పేర్కొన్నారు. బుధవారం నుంచి నూతన బోర్‌వెల్స్ రేట్లు అమలౌతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేష్, జనరల్ సెక్రటరీ ఓరుగంటి లక్ష్మీ నారాయణ, టి.జగన్నాథం, ట్రెజరీ ఎం.వెంకట్‌రెడ్డి, అడ్వైజర్ విక్రమ్ శర్మ, సీహెచ్. వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫెన్సింగ్‌కు కూల్చివేస్తున్న హయత్‌నగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు



ఫెన్సింగ్‌ను కూల్చి జీహెచ్ఎంసీ స్థలమని టౌన్‌ప్లానింగ్ అధికారులు పాతిన బోర్డు

ఫెన్సింగ్ కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

'సాక్షి' కథనానికి స్పందన

- గ్రీనరీకి జీహెచ్ఎంసీకే మాత్రమే అధికారం : టౌన్‌ప్లానింగ్ ఏసీపీ

మన్సూరాబాద్: ఓ యజమాని తనకు సంబంధం లేని స్థలంలో గ్రీనరీ పేరుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. దీంతో రూ.3కోట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం సాక్షిలో శనివారం ప్రచురితం అయింది. ఈ కథనానికి హయత్‌నగర్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి సదరు ఫెన్సింగ్‌ను కూల్చి వేసి జీహెచ్ఎంసీ స్థలమని బోర్డు పాతారు. వివరాల్లోకి వెళితే.. మన్సూరాబాద్ సహారా స్టేట్స్‌కాలనీ మొదటి గేటు సమీపంలోని ఓ భవన యజమాని సెట్‌బ్యాక్‌గా వదలిన స్థలాన్ని గ్రీనరీ చేస్తున్నానని నెపంతో తిరిగి ఆక్రమించేందుకు యత్నించాడు. దీనిపై 'సాక్షి'లో కథనంగా రావడంతో శనివారం జీహెచ్ఎంసీ విజిలెన్స్, టౌన్‌ప్లానింగ్ అధికారులు సదరు స్థలాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం హయత్‌నగర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావనీ నేతృత్వంలో అధికారులు ఫెన్సింగ్‌ను జేసీబీ సహాయంతో కూల్చివేసి జీహెచ్ఎంసీ స్థలమని బోర్డు పాతారు. ఈ సందర్భంగా పావనీ మాట్లాడుతూ సదరు నిర్మాణదారుడు నిర్మాణ సమయంలో అనుమతి కోరినప్పుడు సెట్‌బ్యాక్ స్థలాన్ని హుడా (హెచ్ఎండీఏ)కు గిఫ్ట్‌డీడ్ చేశాడని, దీంతో భవన నిర్మాణదారుడుని ఈ స్థలానికి సంబంధం లేదని తెలిపారు. గ్రీనరీ చేయాలంటే జీహెచ్ఎంసీ మాత్రమే చేస్తుందని, భవన యజమాని చేసేందుకు విలులేదని తేల్చారు. ఆక్రమణకు గురవుతున్న స్థలాన్ని కాపాడినందుకు కాలనీవాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

దొంగతనాలపై కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలి

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి

మన్సూరాబాద్: శివారు కాలనీవాసులు దొంగల వట్ల అప్రమంత్తంగా ఉండాలని, విలువైన వస్తువులు ఇంట్లో ఉంచుకోకుడదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి సూచించారు. డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని ప్రియదర్శినీ కాలనీ రోడ్‌నెంబర్–8లో రాజు నివాసంలో దొంగతనం జరగటంతో సదరు కుటుంబాన్ని కార్పొరేటర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బంధువుల అంత్యక్రియలకు వెళ్లి వచ్చేసరికే ఘటన జరగడం దురదృష్టకరమని, ఇంట్లోని సుమారు 36 తులాల బంగారం, 15 తులాల వెండి వస్తువులు దొంగలించడం బాధకరమన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించకపోతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. బంధువుల ఇంటికి, ఇతర పనులపై బయటకు వెళ్తే పక్కింటివారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మధుసూదన్‌రెడ్డి, లింగస్వామి, సత్తిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, కొండల్‌రెడ్డి, సందీప్, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, కడారి యాదగిరియాదవ్, పారందసాయి తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి



అధికారులతో సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించే ఆషాఢ మాస బోనాల సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సైదాబాద్‌లో కార్పొరేటర్ విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. బోనాల సందర్భంగా చేప ట్టాల్సిన పలు పనుల గురించి కార్పొరేటర్ అధికారులకు సూచనలు చేశారు. డివిజన్ పరిధిలోని దేవాలయాల సమీపంలోని విద్యుత్ దీపాలు అన్ని వెలిగేలా చూడాలని, పాడైన వాటి స్థానంలో నూతన దీపాలను అమర్చాలని అ న్నారు. కొన్ని దేవాలయాల సమీపంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ దీపాల నిర్వహణ మెరుగుపరచాలని, అందుకోసం అధికారులు పండగ సమయాన్ని దృష్టిలో పెట్టుకొని రాత్రి వేళల్లో సిబ్బందితో కలసి దేవాలయాల వద్ద పర్యటించి అవసరమైన చోట తగిన చర్యలు తీసుకోవాలని కో రారు. ఈ సమావేశంలో స్ట్రీట్‌లైట్స్ ఏఈ రా జు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, సూపర్‌వైజర్ ర వి, లైన్‌మెన్ శరత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.